సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



భర్తే కాలయముడు
మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో.. భర్తే కాలయముడిగా మారి భార్యను హత్య చేసిన సంఘటన కడపలో చోటుచేసుకుంది. -8లో



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామ కృష్ణారెడ్డి పార్టీ నేతలకు సూచించారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.6/17.7

జిల్లాలో శుక్రవారం 17.7 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

కడప కార్పొరేషన్: విద్యుత్ శాఖలో జమ్మలమడుగు సబ్ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు ఆ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ తెలిపారు. విద్యుత్ సంస్థకు చెందిన రూ.16.60 లక్షలను పక్కదారి పట్టించి అవినీతికి పాల్పడినందుకు ఈ చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. జమ్మలమడుగు సబ్ డివిజన్ కార్యాలయంలోని ఆర్‌ఓ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్ ఎం.సుజిత్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ విజయ్‌బాబును సస్పెండ్ చేశామన్నారు. విద్యుత్ బిల్లుల ద్వారా 2024 డిసెంబర్ 20న వచ్చిన మొత్తం రూ.8,93,694, ఈ ఏడాది జనవరి 23న వచ్చిన మొత్తం రూ.7,66,250 కలిపి రూ.16,59,944లను సంస్థ బ్యాంకు ఖాతాలో వేయకుండా సుజిత్ అవినీతికి పాల్పడ్డాడని, నాలుగు నెలలుగా అతని ప్రవర్తనను పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యం వహించినందుకు జేఏఓ విజయ్‌బాబును సస్పెండ్ చేశామని వివరించారు.

వైవీయూలో స్కౌట్స్, గైడ్స్ విభాగం ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైవీయూ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. విశాఖపట్నం హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌తో శుక్రవారం వైవీయూ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి సమక్షంలో కులసచివులు పుత్తాపద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్, నేషనల్ మెంబర్ పి.దయాకర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సమావేశంలో పర్యావరణ శాఖ సహా ఆచార్యులు చంద్రశేఖర్, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కడప జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకట సుమంత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: సీఐఎస్ఎఫ్ రిక్రూట్‌మెంట్ ఆఫ్ కానిస్టేబుల్, డ్రైవర్స్, డీసీపీఓ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఎంవీ, హెచ్‌టీవీ, ఎల్ఎంవీ, మోటారు సైకిల్, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ పూర్తి చేసి ప్రభుత్వ రంగంలో ఉపాధిని కోరుకునే వ్యక్తులకు మంచి అవకాశమన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్://సీఐఎస్ఎఫ్ఆర్‌ఈసీటీటీ.సీఐఎస్ఎఫ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఫిబ్రవరి 5 నుంచి మార్చి 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ఐఓసీ రిక్రూట్‌మెంట్ ఆఫ్ వర్క్‌మెన్‌లో..

జిల్లా ఐఓసీ రిక్రూట్‌మెంట్ ఆఫ్ వర్క్‌మెన్ అటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. జూనియర్ ఆపరేటర్ గ్రేడ్–1, జూనియర్ అటెండెంట్ గ్రేడ్–1 (స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ఫర్ డిజబుల్), జూనియర్ బిజినెస్ అసిస్టెంట్ గ్రేడ్–3లకు (స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ఫర్ డిజబుల్)ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ రంగంలో ఉపాధిని కోరుకునే వ్యక్తులకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఐఓసీఐ.కామ్/లెటెస్ట్:జాబ్ ఓపెనింగ్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 3 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు.

నిజాయితీకి మారుపేరు దామోదరం సంజీవయ్య



దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: నిజాయితీ, నిరాడంబరత్వం, విలువలకు మారుపేరుగా మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు గడించారని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ కొనియాడారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ (ఎస్పీ అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

కడప సెవెన్‌రోడ్స్: కలెక్టరేట్‌లో దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేశ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత, జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

- ముక్క ముట్టేందుకు జంకుతున్న జనం
- తగ్గిన చికెన్ కొనుగోళ్లు
- కుదేలైన కోళ్ల ఫారం నిర్వాహకులు
- అప్రమత్తమైన పశు వైద్యాధికారులు
- ఆందోళన వద్దంటున్న అధికార యంత్రాంగం

బర్డ్‌ఫ్లూ భయం

కడప అగ్రికల్చర్: బర్డ్‌ఫ్లూ కలకలం రేపుతోంది. చికెన్ ప్రియులు ముక్క ముట్టాలంటే.. భయపడిపోతున్నారు. ఇటీవల ఉభయ గోదావరి జిల్లాల్లో కోళ్ల మరణాలకు కారణం.. బర్డ్‌ఫ్లూ అని నిర్ధారణ కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. తాజాగా పొరుగున ఉన్న జిల్లా కేంద్రమైన కర్నూలు నగరంలో.. బర్డ్‌ఫ్లూ సోకి బాతులు మృతి చెందడంతో మరింత కలవరపాటుకు గురవుతున్నారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఈ వైరస్ 70 డిగ్రీల సెంటిగ్రేడ్, అంతకన్నా ఎక్కువ వేడి నీటి దగ్గర బతకలేదని.. మనం 70 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద చికెన్ ఉడికిస్తామని.. అందువల్ల ఎలాంటి ప్రభావం, ప్రమాదం లేదని వివరిస్తున్నారు. ప్రజలు చికెన్‌ను బాగా ఉడికించి తింటే ఎలాంటి ప్రమాదం ఉండదని స్పష్టం చేస్తున్నారు.

ముందస్తు చర్యలు

బర్డ్‌ఫ్లూపై వస్తున్న వార్తలతో జిల్లాలో చికెన్ అమ్మకాలు కొంత మందగించినట్లు వ్యాపారులు తెలిపారు. దీంతో చికెన్, గుడ్ల ధరలు కాసింత తగ్గుముఖం పట్టాయి. కోళ్ల ఫారం నిర్వాహకులు కుదేలయ్యారు. పశు సంవర్ధకశాఖ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా కోళ్ల పెంపకందారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కోళ్ల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చెబుతున్నారు. కోళ్లకు ఏ చిన్న జబ్బు వచ్చినా.. పశువైద్యులకు సమాచారం ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. పొరపాటున కోళ్లు చనిపోతే.. ఏ జబ్బుతో మృత్యువాత పడ్డాయో డాక్టర్ల ద్వారా నిర్ధారణ చేస్తున్నారు. కోళ్ల పెంపకందారులు ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.





పెద్దముడియం మండలం పెద్దపసుపులలో కోళ్లఫారం పరిశీలిస్తున్న అధికారులు

కోళ్ల దిగుమతిపై గట్టి నిఘా

జిల్లాలో బద్వేలు, పెద్దముడియం, లక్ష్మీపేట, జమ్మలమడుగు, చాపాడు, నందిమండలం, వెదురూరు, చిన్నగుళువలూరు, తాళ్లమాపురంలో కోళ్ల ఫారంలు ఉన్నాయి. వాటిలో 75 వేల బ్రాయిలర్ కోళ్లు, 3 లక్షల 5 వేల గుడ్లు పెట్టే కోళ్లు ఉన్నట్లు కోళ్ల ఫాం నిర్వాహకులు తెలిపారు. ఇటీవల వ్యాపారాలు లేక తీవ్రంగా నష్టపోతున్నామని వారు పేర్కొంటున్నారు. మన జిల్లాలోని కోళ్ల ఫారంలలో పెంచే కోళ్లే జిల్లా వాసులకు దాదాపు సరిపోతున్నాయని హోల్‌సెల్ చికెన్ షాపుల వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే పొరుగున్న ఉన్న నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల నుంచి అరకొరగా కోళ్ల దిగుమతి అవుతున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. వాటిపై కూడా ప్రస్తుతం గట్టి నిఘా పెట్టామని వారు పేర్కొంటున్నారు. వ్యాధి బారిన పడినవి సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వ్యాధి ఉన్న కోళ్లకు దూరం

రాష్ట్రంలో కోళ్లకు ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా (హెచ్5ఎన్1 బర్డ్‌ఫ్లూ) వేగంగా వ్యాపిస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక వ్యక్తికి బర్డ్‌ఫ్లూ సోకిందనే వార్త కలకలం రేపింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఇప్పటి వరకు మనుషులకు బర్డ్‌ఫ్లూ నమోదైన ఘటనలు చోటుచేసుకోలేదని వైద్యశాఖ స్పష్టం చేసింది. పక్షుల నుంచి మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం అత్యంత అరుదుగా ఉంటుందని పశువైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వ్యాధి బారిన పడిన పక్షులకు దగ్గరగా ఉండే వ్యక్తులకు అరుదుగా ఈ వైరస్ సోకే అవకాశం ఉంటుందని, మనుషుల నుంచి మనుషులకు సోకిన సందర్భాలు లేవన్నారు. వ్యాధి బారిన పడిన కోళ్లు, జంతువులకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

వ్యాధి వ్యాప్తి చెందే పక్షి జాతులు



బర్డ్‌ఫ్లూ వ్యాధి తెల్ల జాతి ఫారం కోళ్లలో గిన్న కోళ్లు, టర్కీ కోళ్లు, నీటి పక్షులు, బాతులు, కొంగలు, వన్యపక్షులు, నెమళ్లు, విదేశీ పక్షుల ద్వారా కూడా వ్యాపించవచ్చు. ముక్కు, కళ్ల వెంట నీరు కారడం, మెడ వాల్చడం, నీరసంగా ఉండటం, కాళ్ల శరీర భాగాలపై మచ్చలు ఏర్పడటం, తలపై భాగంలో ఉండే వాటిల్స్ ఉబ్బడం, దానిపై మచ్చలు ఏర్పడటం, విరేచనాలు ఎక్కువ కావడం కోళ్లలో గమనించవచ్చు. ఈ వ్యాధి తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ శాతం కోళ్లు మరణించే అవకాశం ఉంటుందని పశు వైద్యాధికారులు తెలిపారు.

తగ్గిన ధరలు



జిల్లా వ్యాప్తంగా కోడి మాంసం, గుడ్ల విక్రయాలు 15 శాతం పైగా తగ్గాయని చికెన్ వ్యాపారులు తెలిపారు. దీంతో వాటి ధరలు క్రమేపీ తగ్గుముఖం పడుతున్నాయి. చాలా మాంసం దుకాణాలు కొనుగోలుదారులు రాక వెలవెలబోతున్నాయి. మొన్నటి వరకు చికెన్ ధర కిలో రూ.190, స్కిన్‌లెస్ చికెన్ రూ.210 ఉండేదని వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం చికెన్ కిలో రూ.170, స్కిన్‌లెస్ చికెన్ రూ.190 ఉందని వారు పేర్కొన్నారు. కోడి గుడ్లు హోల్‌సెల్ షాపుల్లో మొన్నటి వరకు డజన్ రూ.79 ఉండగా, ప్రస్తుతం రూ.59 ఉన్నట్లు గుడ్ల వ్యాపారులు తెలిపారు.



అమ్మకాలు లేకపోవడంతో కడపలో ఓ చికెన్‌షాపు వద్ద ఖాళీగా కూర్చున్న వ్యాపారులు

మనుషులకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఇలా..



బర్డ్‌ఫ్లూ లక్షణాలు సాధారణ ఫ్లూ లక్షణాలను పోలి ఉంటాయని వైద్యులు తెలిపారు. ఇన్‌ఫెక్షన్ సోకిన వ్యక్తులకు దగ్గు, విరేచనాలు, జ్వరంతో పాటు శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తుతాయి. వీటితోపాటు తలనొప్పి, కండరాల నొప్పి, ముక్కు కారటం, గొంతునొప్పి కూడా అనిపించవచ్చు. బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఉన్న వారిని వేరే గదిలో ఉంచడం మంచిది. లేకపోతే మరొకరికి సోకే ప్రమాదం ఉంటుంది. ఇలాంటప్పుడు తప్పకుండా వైద్య నిపుణులు, సలహాలు తీసుకుని తగిన మందులు వాడాలని వైద్యులు తెలిపారు.

అమ్మకాలు తగ్గాయి



నాలుగు రోజుల నుంచి చికెన్ అమ్మకాలు తగ్గముఖం పట్టాయి. బర్డ్‌ఫ్లూ వదంతులతో చికెన్ కొనేందుకు జనాలు అంతగా ఆసక్తి చూపడం లేదు. త్వరలోనే మళ్లీ కొనుగోళ్లు ఊపందుకుంటాయి.
– విజిడ్ రఫాత్ ఉల్లాహ్, రఫిక్ హోల్‌సెల్ చికెన్ వ్యాపారి, కడప

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కాలేదు. పూర్తి స్థాయిలో నిఘా ఉంచుతున్నాం. మా సిబ్బంది ద్వారా కోళ్లఫాంను సందర్శించి వారికి తగిన సలహాలు కూడా ఇప్పిస్తున్నాం.
– డాక్టర్ శారదమ్మ, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, కడప

ఆత్మీయం.. అనురాగం



ఆశీర్వచనాలు.. శుభాకాంక్షలు




జ్ఞాపకం.. పదిలం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన ఆత్మీయత, అనురాగం మధ్య సంబురంగా సాగింది. వైఎస్సార్‌సీపీ అధినేత శుక్రవారం కడపకు వచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కుమారుడు ఎంవీ సుధీర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీ మౌనిక వివాహ మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌ను చూసేందుకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ నేతతో కరచాలనం చేసేందుకు అభిమానులు, పార్టీ శ్రేణులు పోటీ పడ్డారు. ఆయన చిరునవ్వుతో పలుకరించి, వారిలో ఉత్సాహాన్ని నింపారు.
– కడప కార్పొరేషన్



జననేత అభివాదం



నూతన వధూవరులతో ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు



హనుమద్వాహనంపై ఆశీనులైన శ్రీరంగనాథస్వామి

పులివెందుల టౌన్: పులివెందులలోని పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం మండపంలో అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ వెంకటరమణ పర్యవేక్షించారు. సాయంత్రం హనుమద్వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. రాత్రి తిరునాల ప్రాంగణంలో గాలివీడు వాస్తవ్యులు డాక్టర్ నాగేశ్వరరావు బృందంచే సాసవల చిన్నమ్మ కథ నిర్వహించారు.

జిల్లాకు 'నీతీ ఆయోగ్' పురస్కారం

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ఆకాంక్షిత జిల్లాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు వైఎస్‌ఆర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 'నీతీ ఆయోగ్' ద్వారా అత్యుత్తమ పురస్కారంతో రూ. 3 కోట్లు కేటాయించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన తన చాంబర్‌లో జేసీ అదితిసింగ్, ఇతర అధికారులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి అనే అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు ఈ పురస్కారం లభించిందన్నారు. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36 జిల్లాలకు ఈ పురస్కారాన్ని ప్రకటించారని పేర్కొన్నారు.

- జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఇంటర్మీడియెట్ పబ్లిక్ థియరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్ఐఓ వెంకట సుబ్బయ్య, విద్యాశాఖ, పోలీస్, ఏపీఎస్ ఆర్టీసీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు, పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి

రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి పూర్తి బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో బద్వేల్, కడప రెవెన్యూ డివిజన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలు, వివిధ చట్టాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం(వర్క్ షాప్) కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, బద్వేల్ ఆర్డీవో చంద్ర మోహన్, కడప, బద్వేల్ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

- స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా జిల్లాలోని గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి నెలా 3వ శనివారం చేపట్టే 'స్వచ్ఛ దివస్' కార్యాచరణపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులకు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఓబులమ్మ, డీపీవో రాజ్యలక్ష్మి, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న కలెక్టర్, జేసీ, జిల్లా అధికారులు

రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో నాలుగు డివిజన్ల పరిధిలోని వివిధ మండలాల్లో పని చేస్తున్న రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతికి పాల్పడుతున్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన మేరకు ఈ కింద తెలిపిన 20 మంది సచివాలయ రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. బద్వేలు మండలం తిప్పనపల్లి వీఆర్ఓ సాలమ్మ, చక్రాయపేట మండలం సురభి సర్వేయర్ విజయ్ కుమార్, దువ్వూరు వీఆర్వో మునిస్వామి, దువ్వూరు మండలం ఇడమడక వీఆర్ఓ యాదవ్, జమ్మలమడుగు మండలం బి.బొమ్మపల్లి వీఆర్వో భీమన్న, కడప మండలం మామిళ్ళపల్లి వీఆర్ఓ ఎస్.జహీర్ అబ్బాస్, కడప మండలం ఉక్కాయపల్లె వీఆర్ఓ శ్రీనివాసులు, కలసపాడు మండలం ఇ.రామాపురం వీఆర్వో ఎ.కొండయ్య, పిడుగుపల్లి వీఆర్ఓ ఆనందరావు, కలసపాడు మండలం పిడుగుపల్లి ఆర్ఐ కె.చంద్రశేఖరరావు, కమలాపురం మండలం కోగటం ఆర్ఐ అర్జున్, లేటపల్లి వీఆర్ఓ చిన్న వెంకటరామన్న, మైదుకూరు మండలం ఆదిరెడ్డిపల్లి వీఆర్ఓ మధుడేవిడ్, మైలవరం మండలం తలమంచిపట్నం వీఆర్వో ఓబులేశు, రాజుపాలెం మండలం టంగుటూరు వీఆర్వో సరళ, వల్లూరు వీఆర్వో ఖాజా మొహిద్దీన్, వేంపల్లి మండలం రామిరెడ్డిపల్లి వీఆర్ఓ ఓబయ్య, ఒంటిమిట్ట మండలం మంటపంపల్లి వీఆర్ఓ వై.శ్రీనివాసులు, వేంపల్లి మండలం కథలూరు సర్వేయర్ కె.బ్రహ్మయ్య, వేంపల్లి సర్వేయర్ పి.బ్రహ్మకుమార్‌రెడ్డిలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

అమ్మో పులి..!



- పులివెందుల ప్రాంతంలో చిరుతల సంచారం
- భయాందోళనలో జనం
- ఎంపీ దృష్టికి తీసుకొచ్చిన రైతులు

పులివెందుల రూరల్: నియోజకవర్గంలో 50 రోజులుగా చిరుత పులుల సంచారం అలజడి రేపుతోంది. దీంతో రైతులు, ప్రజలు తోటల వద్దకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. లింగాల, పులివెందుల, సింహాద్రిపురం తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో చిరుతలు తరచుగా సంచరిస్తున్నాయి. ఈ నెల 1న సింహాద్రిపురం మండలం రామాపురం, బలపనూరు గ్రామాల మధ్యలో రైతు పొలానికి అమర్చిన విద్యుత్ తీగలు తగిలి చిరుత పులి మృతి చెందింది. దీంతో తోట రైతు గుట్టుచప్పుడు కాకుండా చిరుత పులిని పూడ్చేశాడు. ఈ విషయం తెలిసిన కొందరు గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు సంఘటన స్థలాన్ని సందర్శించి.. మగ చిరుత మృతి చెందిందని వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఆడ చిరుత, చిరుత పిల్లలు తిరుగుతుండేవని రైతులు భయాందోళన చెందుతున్నారు. అలాగే 2024 డిసెంబర్‌లో లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో అరటి తోట వద్దకు నీరు అందించేందుకు వెళ్లిన రైతుకు చిరుత పిల్లలతో కనిపించడంతో ఆందోళనకు గురయ్యాడు. వాటిని ఆయన తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లితే.. వారు పరిశీలించి ఇవి చిరత అడుగులు కాదని, అడవి పిల్లి అడుగులు అని నిర్ధారించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె పరిధిలో చిరుత సంచరించినట్లు రైతులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం నల్లపురెడ్డిపల్లెలో మళ్లీ చిరుతలు సంచరించాయని గ్రామ రైతులు పేర్కొంటున్నారు. అలాగే తొండూరు మండలం కృష్ణంగారిపల్లె, గంగమ్మ చింతల ప్రాంతాలలో చిరుతలు కనిపించినట్లు వివరిస్తున్నారు.



రామాపురం గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన చిరుత (ఫైల్)

డీఎఫ్ఓతో మాట్లాడిన ఎంపీ

ఈ విషయాన్ని కొందరు రైతులు శుక్రవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎంపీ వెంటనే జిల్లా ఫారెస్ట్ అధికారి వినిత్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. చిరుతల వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగక ముందే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చిరుతలు సంచరిస్తున్న గ్రామాల్లో సీసీ కెమెరాలు, బోన్‌లు ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు.

క్లుప్తంగా

బాలికపై అత్యాచారం

– యువకుడిపై పోక్సో కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : మైనర్ బాలికను అత్యాచారం చేసిన ఘటనలో యువకునిపై త్రీ టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన నల్లబోతుల కుల్లాయప్ప అనే యువకుడు మాయమాటలు చెప్పి ఒక మైనర్ బాలికను తీసుకెళ్లాడు. అంతకు ముందు బాలిక కనిపించలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఈ క్రమంలో గురువారం బాలికను పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కుల్లాయప్ప అలియాస్ హర్షపై శుక్రవారం సాయంత్రం అత్యాచారం, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు నట్లు త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

రూ.4.42 లక్షలు పలికిన తలనీలాల సేకరణ వేలం

గోపవరం : శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు సమర్పించే తలనీలాలు రూ.4.42 లక్షలు పలికాయి. బద్వేలు దేవదాయశాఖ కార్యాలయంలో ఈఓ రామలింగారెడ్డి పర్యవేక్షణలో మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి తలనీలాల సేకరణకు శుక్రవారం వేలం నిర్వహించారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన పి.హరిక్రిష్ణ వేలం పాట దక్కించుకున్నాడు.

పక్షవాతం నయం కాలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వసంతపేటకు చెందిన పల్లా శ్రీనివాసులు (51 జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్లా శ్రీనివాసులుకు ఐదేళ్ల క్రితం పక్షవాతం సోకింది. అప్పటి నుంచి ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాలేదు. ఈ క్రమంలో అతను గురువారం ఇంటి బయట ఉన్న బాత్రూంలోకి వెళ్లాడు. చాలా సేపయినా అతను బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపు పగులకొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే శ్రీనివాసులు కాలిన గాయాలతో చనిపోయి ఉన్నాడు. బాత్రూంలో ఉన్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని అతను నిప్పంటించుకున్నాడు. పక్షవాతం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడు హరీశ్వర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపారు.

అత్తపై అల్లుడు దాడి

– సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : అత్తపై దాడి చేసిన ఘటనలో అల్లుడిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వసంతపేటకు చెందిన సాహితికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హరీష్‌తో గతేడాది మార్చి 22న వివాహం అయింది. కొన్ని రోజుల పాటు భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. తర్వాత వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం తీసుకొని రావాలంటూ అతను భార్యను వేధించసాగాడు. ఈ క్రమంలో ఈ నెల 8న సాహితి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. భార్య, కుమార్తెను చూసేందుకు హరీష్ గురువారం అత్తగారింటికి వెళ్లాడు. అక్కడ సాహితి, హరీష్‌లు గొడవ పడుతుండగా సాహితి అమ్మ వెంకటరంగమ్మ అడ్డువచ్చింది. దీంతో హరీష్ ఆమెను కొట్టడంతో తలకు గాయమైంది. సాహితి ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి తెలిపారు.

భర్తే కాలయముడు

- మద్యానికి డబ్బులు ఇవ్వలేదని సుత్తితో భార్యతలపై బాదిన భర్త
- ఇంటిలోనే రక్తపు మడుగులో కుప్పకూలిన భార్య
- ముగ్గురు చిన్నారుల భవితవ్యం ఏమిటో?




రక్తపు మడుగులో జమీల మృతదేహం (ఇన్‌సెట్) హత్యకు గురైన జమీల (ఫైల్)



బిక్కుబిక్కుమంటు రోదిస్తున్న చిన్నారులు

కడప అర్బన్ : భర్తే కాలయముడిగా మారి భార్య తలపై సుత్తితో కొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటన కడప నగరంలో సంచలనం కలిగించింది. మద్యం సేవించడానికి డబ్బులను ఇవ్వలేదనే నెపంతో జీవితాంతం తోడు నీడగా నిలిచి, పిల్లలకు మంచి తండ్రిగా చూసుకోవాల్సిన ఆ వ్యక్తి భార్యను కిరాతకంగా హత్య చేసిన సంఘటన హృదయవిదారకంగా మారింది. ఈ సంఘటన వారి ముగ్గురు పిల్లల జీవితాన్ని సుడిగుండంలోకి నెట్టేసింది. కడప నగరంలోని టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్‌ఐ ఎస్‌కెఎం హుసేన్, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బెల్లమండివీధి, చిన్నమునిరావు వీధిలో గత నెల రోజులక్రిందట ఓ ఇంటిలో బాడుగకు పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, అతని భార్య పఠాన్ జమీల (28) చేరారు. వీరికి ముగ్గురు సంతానం. వీరిలో షాహిదాఖానం(9), ఏజాజ్‌ఖాన్ (7), అలినాఖానం(5) ఉన్నారు. ఇమ్రాన్‌ఖాన్ ఎలక్ట్రిషన్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్యతో తరచూ గొడవపడుతూ తాను మద్యం సేవించి వచ్చి మరింత తీవ్రస్థాయిలో భార్యను వేధించేవాడు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం వరకు పని చేసుకుని వచ్చిన ఇమ్రాన్‌ఖాన్ తన భార్యకు రూ. 1000 డబ్బులు ఇచ్చాడు. ఆ డబ్బులో రూ. 500 దాచిపెట్టి, రూ.300 తన భర్తకు మద్యం సేవించేందుకు ఇచ్చింది. రూ. 200 కూరగాయలను తీసుకుని వచ్చింది. రాత్రి 9 గంటల సమయంలో తనకు మద్యం సేవించడానికి ఇంకా డబ్బులు కావాలంటూ భార్య జమీలతో భర్త వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో భార్య జమీల ఈనెల అద్దె డబ్బులను కట్టాలని, అదే కట్టకుండా డబ్బులను మద్యానికి ఇవ్వమని అంటున్నావా? అనీ అరిచింది. తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త తాను ఉపయోగించే ఎలక్ట్రిషన్ కిట్‌లో ఉన్న సుత్తిని తీసుకుని ఆవేశంతో ఊగిపోతూ భార్య తలపై మూడు సార్లు దాడి చేశాడు. ఈ దెబ్బలకు రక్తపుమడుగులో అక్కడికక్కడే జమీల కుప్పకూలిపోయింది. తన తండ్రి తల్లిని సుత్తితో బాదిన విషయాన్ని గమనించిన పెద్దకుమార్తె షాహిదాఖానమ్ భయంతో తన బంధువుల ఇంటికి పరుగుతీసింది. వారికి చెప్పగానే జమీల బావ, అన్నదమ్ములు పరుగెత్తుకుంటూ వచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎట్టకేలకు స్థానిక ప్రజల సాయంతో జమీలను ఆటోలో రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ డాక్టర్లు ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. చుట్టుపక్కలా విచారించారు. తమ తల్లి దారుణంగా హత్యకు గురి కావడం, తన తండ్రే హత్య చేయడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. వారి భవిష్యత్తు ఎలా వుంటుందోననీ స్థానికులు అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ సంఘటనతో ఐదుగురు జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది.

మృతదేహంతో అర్ధరాత్రి ఆందోళన

- కొండాపురం మండలం తిరుమలాయపల్లె వద్ద గ్రామస్తుల నిరసన
- బాధితుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్
- రూ. 20 లక్షల ఆర్థిక సాయం, ఒకరికి ఉద్యోగం ప్రకటించిన ఆదాని సంస్థ



ట్రాక్టర్ బోల్తాపడటంతో మృతి చెందిన విశ్వనాథ్(ఫైల్)

జమ్మలమడుగు : కొండాపురం మండలం తిరుమలాయపల్లెకుంట వద్ద యువకుడి మృతదేహంతో బంధువులు గ్రామస్థులు గురువారం అర్ధరాత్రి నిరసన చేపట్టారు. దొంతికోన వద్ద నిర్మిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు పనుల నిమిత్తం కూలికి వెళ్లిన అమ్మినేని విశ్వనాథ్(17) ప్రమాదంలో మృతి చెందాడు. ఆదాని సంస్థ మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని, అంతవరకు మృతదేహాన్ని తరలించమని గామస్తులు రోడ్డుపైనే బైఠాయించారు.

కూలి పనికి వెళ్లి కానరాని లోకానికి..

కొండాపురం మండలం దొంతికోన వద్ద రూ.1500 కోట్లతో 800 మెగా వాట్స్ సామర్థ్యం కలిగిన హైడ్రో పవర్ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఆదాని సంస్థ ఈ ప్రాజెక్టు పనులను చేపడుతోంది. ఇందుకు సంబంధించిన మెజారిటీ పనుల్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ కంపెనీ సబ్ కాంట్రాక్టు దక్కించుకుంది. ఈ విషయమై సీఎం రమేష్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి మధ్య గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. రిత్విక్ కంపెనీ అక్కడ పనులు మొదలెట్టడం, ఆది వర్గం వాటిని అడ్డుకోవడం షరా మాములైంది. ఈనెల 8, 9, 10తేదీల్లో కూడా ప్రాజెక్టు వద్ద పోలీసులు పూర్తిస్థాయి బందో బస్తును ఏర్పాటు చేశారు. బుధవారం పనులు తిరిగి మొదలు పెట్టడంతో కొందరు కూలీలు అవసరం అయ్యారు. ఈ క్రమంలో తిరుమలాయ పల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్(17) కూడా కూలి పనికి వెళ్లాడు.

పనులు ప్రారంభించిన తొలిరోజే..

హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల వద్దకు నీటిని ట్యాంకర్‌తో తీసుకురావాలని అక్కడి నిర్వాహకులు విశ్వనాథ్‌ను ట్రాక్టర్ డ్రైవర్‌గా పంపించారు. బోరువద్ద నీటిని నింపుకుని తీసుకుని వస్తుండగా బుధవారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో రాగికుంట పొలాల్లో మలుపు వద్ద ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తాపడింది. ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయిన విశ్వనాత్ అక్కడికక్కడే మరణించాడు. ఆ దారిన వెళ్తున్న రాగికుంట వాసి తిరుమలాయి పల్లె గ్రామస్తులకు సమాచారం అందించారు. ట్రాక్టర్‌ను పక్కకు తీయగా అప్పటికే విశ్వనాథ్ చనిపోయి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న తాళ్లప్రొద్దుటూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే సమయం మించి పోవడంతో వైద్యులు గురువారం పోస్టుమార్టం పూర్తిచేసి సాయంత్రం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మృతదేహంతో రోడ్డుపైనే బైఠాయించి..

మృతదేహాన్ని మొదట తిరుమలాయపల్లెకు తీసుకొచ్చిన గ్రామస్తులు అటునుంచి దొంతికోన వద్ద నిర్మాణ పనులు జరుగుతున్న ఆదాని హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దకు మృతదేహాన్ని తరలించే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన పోలీసులు జనాన్ని ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా తిరుమలాయపల్లెకుంట వద్ద అడ్డుకున్నారు. ఈ సమయంలో వారు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. డ్రైవింగ్ అంతంత మాత్రం వచ్చే తమ కుమారుడి మృతికి ముమ్మాటికి ఆదాని కంపెనీయే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని, అంత వరకు మృతదేహాన్ని ఇక్కడి నుంచి కదిలించేది లేదని భీష్మించుకున్నారు.

రూ. 20 లక్షల పరిహారం ప్రకటించిన ఆదానీ కంపెనీ

మృతుని కుటుంబానికి న్యాయం జరిగేవరకు మృతదేహాన్ని తరలించేదిలేదని పోరాటం చేయడంతో ఆదానీ యాజమాన్యం స్పందించింది. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయంతోపాటు సోదరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. రూ. 20 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందించారు.

ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగల అరెస్ట్

రూ.12లక్షల విలువైన చోరీ వస్తువులు రికవరీ

జమ్మలమడుగు రూరల్ : ఆలయాల్లో చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.12 లక్షల విలువ గల బంగారు, వెండి వస్తువులు, 2 బైక్‌లు స్వాధీనం చేసుకోన్నారు. శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కె. వెంకటేశ్వరరావు సీఐ ఎస్. లింగప్పతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీన పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారి 9 గ్రాముల రెండు బంగారు తాళిబొట్లు, సుమారు 1 కేజీ వెండి, నాలుగు వెండి హస్తాలను దొంగిలించారు. ఈ ఘటనపై సీసీ పుటేజీల ద్వారా దొంగలను గుర్తించామన్నారు. పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె గ్రామానికి చెందిన జంబులదిన్నె బాలక్రిష్ణ, ఉదయగిరి అలియాస్ చింతకాయల హుస్సేన్ బాషా ఇరువురు అంతర్ జిల్లాల్లో 18 దేవాలయాలలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం తాడిపత్రి బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు పల్సర్ మోటార్ బైక్‌లో వస్తున్నారు. పోలీస్‌లను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకొని విచారించగా వారు పలు జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకొన్నారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 20 గ్రాముల బంగారం, 9 కేజీల 40 గ్రాముల వెండి వస్తువులు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు. సీఐ లింగప్ప, ఎస్‌ఐ రామక్రిష్ణ, కానిస్టేబుళ్లు దేవదాసు, రియాజ్, నాగేంద్రలను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించినట్లు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జలరామకృష్ణారెడ్డి



తులసమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జలరామకృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఘోరంగా విఫలమయ్యారని, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జలరామకృష్ణారెడ్డి నాయకులకు సూచించారు. విజయవాడ నుంచి కడపకు వెళుతున్న ఆయన వైఎస్సార్ జిల్లా బద్వేలులో ఇటీవల మృతిచెందిన మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి మాతృమూర్తి వాకమళ్ళ తులసమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మున్సిపాలిటీ, రూరల్ ముఖ్య నాయకులతో సమావేశమై ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు కూటమి పెద్దలు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమేనని ఈ 8 నెలల చంద్రబాబు పాలనలో స్పష్టమైందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై వేధింపులే పనిగా పెట్టుకుని రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని, భవిష్యత్తు మనదేనని నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ చల్లామధుసూదన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, సీనియర్ నాయకులు పుత్తాశ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శివయ్య, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్వర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు

ఉచిత మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్‌రావు

జమ్మలమడుగు : పదవ తరగతి విద్యార్థులకు సాక్షి ఆధ్వర్యంలో పరీక్షలకు సంబంధించిన ఉచిత మెటీరియల్‌ను పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు రాబోయే పదవ తరగతి పరీక్షలకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు ఉచితంగా పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులు ఈ మెటీరియల్‌ను చదివి పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, పీఈటీ మురళి, ఎస్‌ఆర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను కూలీలతోనే చేయించాలి

- ఈనెల 17న గ్రీవెన్స్ డే రోజు అన్ని జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు
- వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 50 శాతం పనులను కూలీలతోనే చేయించాలని వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అటు సంక్షేమ పథకాల అమలులో, ఇటు పరిపాలనలోనూ విఫలమైందన్నారు. అభివృద్ధి నిధులను టీడీపీ నేతలు దోచేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాయలసీమలో జరిగిన అభివృద్ధిని అమరావతికి తరలిస్తున్నారన్నారు. వైఎస్ జగన్ కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించి 48 ట్రిబ్యునల్స్, లా యూనివర్సిటీ, ఏసీబీ కోర్టు, లోకాయుక్త వంటి వాటిని ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం అన్నింటినీ అమరావతికి తరలిస్తోందన్నారు. కడప కొప్పర్తికి కేటాయించిన ఎంఎస్‌ఎంఈ ట్రైనింగ్ సెంటర్‌ను, కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని, అనంతపురంకు కేటాయించిన ఎయిమ్స్‌ను అమరావతికే తరలిస్తుండటం దారుణమన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 50 శాతం పనులను కూలీలతో చేయించాలని, మిగిలిన వాటిని యంత్రాలతో చేయించాలన్నారు. ఈ ప్రభుత్వంలో ఇప్పటికి రూ.700కోట్ల పనులను కాంట్రాక్టు పద్ధతి ద్వారా చేయిస్తూ ఉపాధి కూలీలు, రైతుల కడుపు కొట్టారని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఆ పనులను చేయవద్దని, 4 వారాలు ఆపాలని ఉత్తర్వులిచ్చిందన్నారు. ఈనెల 17వ తేదీ గ్రీవెన్స్ డే రోజు అన్ని జిల్లా కలెక్టరేట్లకు వెళ్లి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నామన్నారు. పంచాయితీ పాలవర్గాల ఆమోదం పనులు చేయించని ఎంపీడీవోలు, కోర్టు ఉత్వర్వులను ఉల్లంఘించిన కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, ఎంపీడీవోలను కోర్టుకు లాగుతామన్నారు. సమావేశంలో ఎంపీపీల సంఘం అధ్యక్షుడు రఘునాథరెడ్డి, జెడ్పీటీసీలు వెంకట సుబ్బయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఏకాంత సేవలో శ్రీవెంకటరమణుడు

- నేడు స్వామివారి కల్యాణం
- భక్తులకు అన్నదానం



ఏకాంత సేవలో సతీసమేత శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డులో వెలసిన శ్రీవేంకటరమణుడి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీవారు ఏకాంత సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వరదాచార్యులు సతీసమేత శ్రీవెంకటరమణస్వామిని అద్దాల మండపంలో ఉంచి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఏకాంత సేవలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

నేడు స్వామివారి కల్యాణం :

శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం సతీసమేత శ్రీవేంకటరమణస్వామి కళ్యాణం నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు వేద మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా శ్రీవారి కళ్యాణం నిర్వహించనున్నారు. అనంతరం బీవీఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ యజమాని బివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులకు అన్నదాన కార్యక్రమంలో విరివిగా పాల్గొని వేంకటరమణుడి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

శివభక్తుల ఆటో బోల్తా

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు కిలో మీటర్ దూరంలో మార్కాపురం వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురు శివస్వాములు గాయపడ్డారు. ఆరుగురు శ్రీశైల మల్లన్న మాల వేసుకున్న శివస్వాములు తాడిపత్రి నుంచి శ్రీశైలంకు ఆటోలో వెళుతుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి ఆటో అదుపు తప్పి ఆటో బోల్తా పడినట్లు తెలిసింది. 108 వాహనంలో వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా విధులు

– జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



కడప అర్బన్ : పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. డీజీపీ ఆదేశాలు క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియచేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. చైన్ స్నాచింగ్ లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గతంలో చైన్ స్నాచింగ్ కు పాల్పడిన నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పోస్టర్లను రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

అప్పల బాధతో యువకుడు ఆత్మహత్య

బి.కొత్తకోట : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బి.కొత్తకోటలో చిల్లర దుకాణం నడుపుకొంటూ జీవిస్తున్న చాకల సుదర్శన్ (26) పెళ్లయి, పిల్లలున్న వితంతవు శ్రావణిని వివాహం చేసుకున్నాడు. కుటుంబం గడిచేందుకు, వ్యాపారానికి అప్పులు చేయడంతో తీర్చే మార్గం తెలియక బాధపడేవాడు. గత ఆదివారం తిరుపతిలో పని చేసుకుని వస్తానని ఇంట్లో చెప్పాడు. అయితే అప్పటికే ఆత్మహత్య చేసుకునేందుకు ఎలుకల మందు తినడంతో ఆపస్మారకస్థితిలో ఉండగా కుటుంబీకులు గుర్తించారు. చికిత్స కోసం తిరుపతి రుయా తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. దీనిపై మృతుని తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం పీటీఎం మండలంలో జరిగింది. పులికల్లు గ్రామానికి చెందిన శ్రీకాంత్ భార్య శిల్ప(28) కుటుంబసమస్యలతో భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.